
అధ్యాపకుల పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్..!



2



2

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీజేపీ ధర్నా



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## జోగినపల్లి శ్రీనివాస రావుకు బిగాల ఘన నివాళి



**అక్షరటుడే, ఇందూరు:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బావమరిది, జోగినపల్లి శ్రీనివాసరావు ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన దశదినకర్మ కార్యక్రమం జరిగింది. దీనికి అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.





## పట్టాలు ఇవ్వకుంటే నిరాహార దీక్ష చేస్తాం

**అక్షరటుడే, లింగంపేట :** మండల కేంద్రంలోని 983 సర్వేనెంబర్‌లో సుమారు 140 మంది రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం లింగంపేట ప్రజావాణిలో దరఖాస్తు చేసి అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. 983 సర్వేనంబర్లు 180 మంది రైతులకు గాను 40 మంది రైతులకు గతంలో పట్టాలు అందజేశారన్నారు. మిగితా రైతులకు పట్టాలు అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. లేకపోతే మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. 983 సర్వే నెంబర్లు పట్టాలు అందకపోవడంతో సాగుచేసిన పంటలను కొనుగోలు చేయడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు, సీఎం రేవంత్ రెడ్డి లింగంపేట పర్యటనకు వచ్చినప్పుడు రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు గుర్తు చేశారు. మాజీ ఎంపీపీ సాయిలు, పోచయ్య, పోకల సాయిరాం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం దళారుల ద్వారా రైస్ మిల్లులకు చేరుతోంది. మూడు నెలల ఉచిత రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయడం దళారులకు వరమైంది. కిలో రూ.18కే కొనుగోలు చేస్తూ, అదే బియ్యాన్ని రీ-సైక్లింగ్ ద్వారా ప్రభుత్వానికే సీఎంఆర్ కింద అప్పగించేందుకు మిల్లర్లు యత్నిస్తున్నారు. నిఘా వర్గాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల కళ్లు గప్పి కోట్ల రూపాయల అక్రమ దందా కొనసాగిస్తుండటం వలస కార్మికుల సంక్షేమానికి పటిష్ట విధానం.

- అక్షరటుడే, డిచ్‌పల్లి



# రేషన్ బియ్యం.. మిల్లర్లకు వరం

- యథేచ్ఛగా రీసైక్లింగ్ దందా
- గ్రామాల్లో తిరుగుతున్న దళారులు
- పట్టించుకోని అధికారులు

ప్రస్తుతం మూడు నెలల సన్నబియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నారు. దీంతో దళారులు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించే ప్రక్రియను జోరుగా సాగిస్తునారు. బైక్‌లు, ఆటోలతో పల్లెల్లోకి వెళ్లి లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఇలా గ్రామాల్లో సేకరించిన బియ్యం మళ్లీ వ్యాపారుల చేతులు మారి రైస్‌మిల్లర్లకు చేరుతున్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి అధిక ధరలకు విక్రయించడం, సీఎంఆర్‌గా చూపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### తనిఖీల వేళ..

పౌరసరఫరాల అధికారులు ఇటీవల మిల్లుల్లో తనిఖీలు చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లులపై చర్యలకు సిద్ధం అవుతున్నారు. సకాలంలో సీఎంఆర్ బియ్యం అందించాలని ఆదేశిస్తున్నారు. దీంతో రైస్ మిల్లర్లు రేషన్ బియ్యం కొనుగోలు చేసి రీ సైక్లింగ్ చేస్తున్నారు. తనిఖీలకు వచ్చే సమాచారాన్ని ముందుగానే తెలుసుకుంటున్న సిండికేట్ మిల్లుల్లోని నిల్వలను రాత్రికి రాత్రే సర్దుబాటు చేస్తోంది. పీడీఎస్ బియ్యాన్ని పాలిషింగ్ చేసి, సాధారణ నోటిఫైడ్ బియ్యంతో కలిపి ప్యాక్ చేయడంతో అధికారులు సైతం ఇది పీడీఎస్ బియ్యమా లేక సీఎంఆర్ బియ్యమా అనేది గుర్తించలేకపోతున్నారు.

### సరిహద్దులు దాటిస్తూ..

నిజామాబాద్ జిల్లాలో 205 రా రైస్, 59 బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి. జిల్లాకు మహారాష్ట్ర పక్కన ఉండడంతో అక్రమంగా సేకరించిన బియ్యం సరిహద్దులు దాటి తరలిస్తున్నట్లు సమాచారం. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలంటే అడపాదడపా దాడులు చేసి కేసులు నమోదు చేయడం సరిపోదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామస్థాయిలో బియ్యం కొనుగోలు చేస్తున్న దళారుల నుంచి రైస్‌మిల్లుల వరకు మొత్తం గొలుసు కట్టు వ్యవహారం గుర్తించాలి. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తే ఈ దందాను అరికట్టవచ్చు.

### మచ్చుకు కొన్ని ఉదంతాలు

ఏప్రిల్ నెలలో డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని గణేష్ రైస్ మిల్లులో అధికారులు 304 క్వింటాళ్ల రేషన్ సన్నబియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రైస్‌మిల్లు కాంట్రాక్టర్లు, వాహన డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. సిరికొండ మండలం కొండాపూర్ శ్రీ బాలాజీ రైస్ మిల్ యజమాని బెజగం భాస్కర్ ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా రీసైక్లింగ్ చేసి 284 క్వింటాళ్ల బియ్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న సమయంలో పోలీసులకు చిక్కారు. భాస్కర్‌పై కేసు నమోదు చేసి బియ్యంతో పాటు లారీని సీజ్ చేశారు.



## ఎస్సారెస్పీకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో


**అక్షరటుడే, మెండోరా:** గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. మహారాష్ట్రలోనూ మోస్తరుగా వర్షాలు పడుతుండడంతో వరద వస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం 1,013 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం 2,894 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు (80.50 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,079.80 అడుగుల (44.489 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు లో 80.053 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ప్రస్తుతం సుమారు 35.56 టీఎంసీల మేర తక్కువగా ఉంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 1,013 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,544 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది.



## మెండోరాలో ప్రజావాణికి 5 దరఖాస్తులు


**అక్షరటుడే, మెండోరా:** మండలంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి మొత్తం ఐదు దరఖాస్తులు నమోదయ్యాయి. శాఖలవారీగా చూస్తే రెవెన్యూ శాఖకు సంబంధించి మూడు దరఖాస్తులు, హౌసింగ్ శాఖకు, ఆర్టీసీకి ఒక్కో దరఖాస్తు అందింది. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, తహశీల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందూరుకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా..




**అక్షరటుడే, ఇందూరు :** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆగస్టు 25న (మంగళవారం) నిజామాబాద్ జిల్లా లో పర్యటించనున్నారు. నగరంలోని పసుపు బోర్డు కార్యాలయంలో రైతులతో మార్కెట్ లింకేజ్ కార్యక్రమంతో పాటు వివిధ ప్రోగ్రామ్స్‌లో పాల్గొననున్నారు. ఆగస్టు 25న ఉదయం 9:15 గంటలకు లోక్ భవన్ నుంచి బయలుదేరి బేగంపేట్ విమానాశ్రయానికి ఆయన చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్ ఐడీవోసీ హెలిప్యాడ్‌కు 10:20 గంటలకు వస్తారు. ఆ తర్వాత పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో యాంటీడ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం, నేషనల్ టర్మరిక్ బోర్డులో రైతులతో మార్కెట్ లింకేజ్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం పీహెచ్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ద్వారా చేపట్టనున్న ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. సాయంత్రం 3:20 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

## యంగ్ ఇండియా పాఠశాల కామారెడ్డిలోనే ఏర్పాటు చేయాలి




**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి నియోజకవర్గానికి కేటాయించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములలో ఏర్పాటు చేయాలని టీవీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలో బస్టాండ్, రైల్వే స్టేషన్‌కు దగ్గరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విస్తారమైన భూములు ఉన్నాయని, ఆ భూములలో విద్యాసంస్థను ఏర్పాటు చేసి అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక విద్యాసంస్థలు లేకపోవడం వల్ల ఇప్పటికే కామారెడ్డి జిల్లా వెనుకబడిపోయిందని, ఏటీసీ సెంటర్ ను కూడా భిక్కనూరులో కాకుండా కామారెడ్డి జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేస్తే జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గమనించి జిల్లా కేంద్రంలోనే విద్యాసంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భిక్కనూరు మండలంలో ఫార్మా కంపెనీల వల్ల పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాబోయే రోజుల్లో తాగేనీరు, పీల్చే గాలి, భూములు కాలుష్యమై ప్రజలు గ్రామాలను విడిచిపెట్టే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రకాల సదుపాయాలు ఉన్న డిగ్రీ కళాశాల భూములలో యంగ్ ఇండియా పాఠశాలను ఏర్పాటు చేస్తే జిల్లా కేంద్రం అభివృద్ధి చెందడంతో పాటు విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. గత సీఎం కేసీఆర్ కామారెడ్డి పర్యటనలో డిగ్రీ కళాశాల భూములలో విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఆ భూములలో విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



## ప్రజావాణికి 103 ఫిర్యాదులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావుతో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, డీపీవో శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

## పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. నగరంలోని సీపీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించారు. కార్యాలయంలో సోమవారం 32 మంది బాధితుల నుంచి సీపీ ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచనలు చేశామన్నారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పనిచేస్తుందని సాయిచైతన్య పేర్కొన్నారు.

## సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడి ఎన్నిక చెల్లదు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఓ వ్యక్తి స్వయంగా ప్రకటించుకున్నాడని.. అతడి ఎన్నిక చెల్లదని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మునిపల్లి సాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని సర్పంచ్‌లకు, అలాగే 32 మండలాల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక వ్యక్తి తానే జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం చెల్లదన్నారు. మండలాల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులకు ఎలాంటి సమాచారం లేకుండా తీసుకున్న నిర్ణయాలకు గుర్తింపు లేదని తెలిపారు. జిల్లాలో సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం ఫోరం నిరంతరం పనిచేస్తోందని సాయిరెడ్డి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలు, సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోరం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి అరికెల జనార్దన్, ఉపాధ్యక్షులు చింతం ఉమారాణి సంజీవ్, వాసు, సుదర్శన్, భూమేశ్, శ్రీను, జలేందర్, రాజు, మోహన్, నీలిమా సాయగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## వలస కార్మికుల సంక్షేమానికి పటిష్ట విధానం



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** విదేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ ప్రవాసులు, వలస కార్మికుల సంక్షేమానికి మరింత పటిష్టమైన విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఫిలిప్పీన్స్ ప్రభుత్వం తమ దేశ పౌరుల కోసం అమలు చేస్తున్న వలస సంక్షేమ విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణలోనూ అనుసరించే దిశగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే పీసీసీ అధ్యక్షుడి నేతృత్వంలో ఎన్నారై పాలసీ తీసుకురావడంతో పాటు గల్ఫ్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు భూపతి రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నారై అడ్వైజరీ బోర్డును ఏర్పాటు చేసిందని, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి వినోద్ కుమార్ ఛైర్మన్‌గా, మంద భీంరెడ్డి వైస్ ఛైర్మన్‌గా, విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు తాను, మరో 11 మంది నిపుణులతో కమిటీ పనిచేస్తోందని వివరించారు. ఎన్నారై సంక్షేమానికి అవసరమైన చర్యలపై అధ్యయనం చేసేందుకు గత మే నెలలో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన కమిటీ, ఆగస్టు 17 నుంచి 21 వరకు ఫిలిప్పీన్స్‌లో పర్యటించిందని రూరల్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఫిలిప్పీన్స్ నుంచి చాలా మంది వివిధ దేశాల్లో నివసిస్తున్నారని, దీంతో ఆ దేశం అమలు చేస్తున్న విధానాలను పరిశీలించామన్నారు.

## స్కూళ్లలో టాయిలెట్లు నిర్మించాలని బీజేపీ నిరసన




**అక్షరటుడే, కోటగిరి :** మండలంలోని పలు స్కూళ్లలో విద్యార్థినుల కోసం టాయిలెట్లను, ప్రహరీలను నిర్మించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పోతంగల్ మండల కేంద్రంలో ధర్నా చేశారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కల్లూరి హన్మాండ్లు (బజరంగ్) మాట్లాడుతూ.. పలు స్కూళ్లలో భవనాలు శిథిలావస్థకు చేరాయన్నారు. కొత్త తరగతి గదులు నిర్మించాలని కోరారు. అలాగే టాయిలెట్లు కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. హైస్కూల్‌లో పీఈటీ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే పీఈటీని నియమించాలని అధికారులకు కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్, ఓమన్ పటేల్, మక్కయ్య, హన్మాండ్లు, కిరణ్ సేట్ తదితరులు పాల్గొన్నారు.



## తల్లి అంత్యక్రియలు నిర్వహించిన కూతురు

**అక్షరటుడే, కామారెడ్డి:** కన్నతల్లికి కడసారి వీడ్కోలు పలకడానికి కొడుకు ఉండాలనే పాత ఆచారాన్ని ఒక కూతురు తన ప్రేమతో చెరిపేసింది. తల్లికి తానే కొడుకుగా మారి అంతిమ సంస్కారాలు నిర్వహించిన హృదయ విదారక ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అడ్లూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ 2వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన పెరుమాండ్ల రాజమణి (65) అనారోగ్యంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు ఉన్నది ఒక్కగానొక్క కుమార్తె భూమవ్వ మాత్రమే. తల్లి మృతితో కుంగిపోయినా, ధైర్యం తెచ్చుకుంది భూమవ్వ. బంధువులు, కాలనీ వాసుల సమక్షంలో తల్లి అంత్యక్రియలు నిర్వహించింది.

## ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించండి

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ :** మండలంలోని ప్రజావాణిలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు మల్లయ్యల సుభాష్ మాట్లాడుతూ.. మండలంలో గత ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన డబుల్ బెడ్ రూంలకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఇళ్లపట్టాలు అందజేసినప్పటికీ లబ్ధిదారులకు ఇంటి నంబర్లు కేటాయించకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. అదే విధంగా మండల కేంద్రంలో 464, 337, 73 సర్వే నంబర్లలో పేదలు ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని వారికి పట్టాలు ఇప్పించాలని కోరారు. పోచారం గ్రామానికి వస్తున్న బస్సును అంజనీ, శివపూర్, తలాబ్ తండా మీదగా మండల కేంద్రానికి నడిపితే ప్రజలకు పాఠశాల విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తానాజీ రావు పటేల్, నవీన్ గౌడ్, అశోక్, దర్బార్ పాల్గొన్నారు.




తెలంగాణ యూనివర్సిటీలో చాలాఏళ్లుగా కీలక సమస్యగా మారిన వివాదానికి నూతన పాలక మండలి(ఈసీ) ఒకింత పరిష్కారం చూపింది. ఈసీ కీలక సమావేశం సోమవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లోని ఉన్నత విద్యాశాఖ కార్యాలయంలో జరిగింది.

– అక్షరటుడే, తెయూక్యాంపస్




# అధ్యాపకుల పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్..!

- తెయూ పాలకమండలి తొలిభేటిలో నిర్ణయం
- ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం..!

వైస్ ఛాన్స్‌లర్(వీసీ) యాదగిరిరావు అధ్యక్షతన సోమవారం ఈసీ భేటీ జరిగింది. రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా, ఆర్థికశాఖ కార్యదర్శి సిక్తా పట్నాయక్, కళాశాల విద్యా కమిషనర్ దేవసేన, వర్సిటీ రిజిస్ట్రార్‌తో పాటు నూతన ఈసీ సభ్యులు హాజరయ్యారు.

### నూతన కమిటీ తొలి భేటీ..

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయానికి నూతన పాలక మండలిని నియమించిన సంగతి తెలిసిందే. నూతన కమిటీ ఏర్పడిన తర్వాత ఇది తొలి కీలక సమావేశం కావడంతో వర్సిటీ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. తెయూలో 2012లో జారీచేసిన నోటిఫికేషన్లను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్లు ఇవ్వొచ్చని గతేడాది నవంబర్‌లో హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పును సవాలు చేస్తూ వర్సిటీ ఉన్నతాధికారులు అడ్వకేట్ జనరల్ న్యాయ సలహాతో ముందుకు వెళ్లారు.

### హైకోర్టు డివిజన్ బెంచ్‌ను..

మరోవైపు 2014లో నియామకమైన అధ్యాపకులు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన డివిజన్ బెంచ్.. 26 నవంబర్ 2025న సింగిల్ బెంచ్ తీర్పును సస్పెండ్ చేస్తూ, అభ్యంతరాలు ఉంటే నాలుగు వారాల్లో అప్పీల్ చేసుకోవాలని ప్రతివాదులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ గడువు ముగిసి ఎనిమిది నెలలు గడుస్తున్నా ప్రతివాదుల నుంచి కౌంటర్ దాఖలు కాలేదు. ఈ అంశంపై ఈసీ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. కోర్టు కేసుకు, పదోన్నతులకు నేరుగా సంబంధం లేదని, రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలు కూడా ఇదే విధానాన్ని పాటిస్తున్నాయని ప్రతిపాదించారు. దీంతో డివిజన్ బెంచ్ తుది తీర్పు షరతులకు లోబడి 2014లో నియామకం పొందిన అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలని ఈసీ ఏకగ్రీవంగా తీర్మానించింది.

### 13 ఏళ్ల నిరీక్షణకు తెర!

గత 13 ఏళ్లుగా పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నామని, కనీసం షరతులతో కూడిన (కండిషనల్) పదోన్నతులైనా ఇవ్వాలని అధ్యాపకులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. మరోవైపు ఉద్యోగం రాక నష్టపోయిన వెంకట్ నాయక్ అనే బాధితుడు రోస్టర్ పాయింట్ల తేడాలు, సాంకేతిక లోపాలపై 13 ఏళ్లుగా కోర్టుతో పాటు జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో 2014 నియామకాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలన్నింటిపై సమావేశంలో సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఎట్టకేలకు పదోన్నతులకు పాలక మండలి ఆమోద ముద్ర వేయడంతో 2014లో నియామకమైన అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### పదోన్నతుల ప్రక్రియకు అనుమతి

రాష్ట్ర అడ్వకేట్ జనరల్ న్యాయ సలహా 2014 ఏడాది అధ్యాపకుల పదోన్నతులకు షరతులతో కూడిన పదోన్నతులు ఇచ్చేందుకు ఏకగ్రీవంగా తీర్మానినట్లు వీసీ యాదగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2014లో నియమితులైన అధ్యాపకులు గత కొన్నేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని, సోమవారం జరిగిన ఈసీ పూర్తిస్థాయి భేటీలో పదోన్నతులపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే యూనివర్సిటీలో అభివృద్ధికి సంబంధించిన పలు తీర్మానాలను ఆమోదించినట్లు వీసీ యాదగిరిరావు పేర్కొన్నారు.

### అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్..

యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఈసీ ఆమోదం తెలిపింది.

1) నూతనంగా మంజూరైన ఇంజినీరింగ్ కళాశాలలో బోధన, బోధనేతర పోస్టుల భర్తీ.

2) 2024-25, 2025-26 వార్షిక బడ్జెట్‌లకు ఆమోదం. 3) నూతన మహిళా, బాయ్స్ హాస్టల్ భవన నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష.

4) అనుబంధ కళాశాలల గుర్తింపు (అఫిలియేషన్), పరీక్షల నిర్వహణ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.



## బిల్లులు చెల్లించాలని వినతి

**అక్షరటుడే, కోటగిరి :** 15వ ఫైనాన్స్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రజావాణిలో అదనపు పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తాను 2018 నుండి 2024 వరకు కోటగిరి గ్రామ సర్పంచ్‌గా సేవలు అందించానన్నారు. ఆ సమయంలో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా కోటగిరి ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మంజూరైనందున పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనంలోకి మార్చడానికి రిపేర్లు చేయించామన్నారు. స్థానిక ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా గ్రామంలోని మురికి కాలువలను ప్రైవేట్ లేబర్‌తో శుభ్రం చేయించానని వివరించారు. ఈ రెండు పనులకు అయిన ఖర్చులను గ్రామ పంచాయతీలో తీర్మానించి ఏంబీ చేశామని తెలిపారు. అయితే పదవీకాలం ముగిసిన తర్వాత స్పెషల్ ఆఫీసర్ ఇన్‌ఛార్జి తీసుకున్నప్పుడు మొత్తం ఎంబీలు తీర్మానించి వారికి అప్పజెప్పడం జరిగిందన్నారు. అయినా కూడా 15వ ఫైనాన్స్ నిధులు రాకపోవడంతో తనకు బిల్లులు చెల్లించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కొత్త సర్పంచ్ రాజకీయ కక్షతో తాను ఖర్చు చేసిన బిల్లులు విడుదల చేయట్లేదని ఆరోపించారు. తనకు బిల్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.

## సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలి




**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్యను యథాతథంగా కొనసాగించాలని ఏబీవీపీ ఇందూరు జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పుల వల్ల పాలిటెక్నిక్ కళాశాలలు దెబ్బతినే అవకాశం ఉందని అక్షయ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు అనేవి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అందుబాటులో ఉండే ఒక చక్కని నాణ్యమైన విద్యావ్యవస్థ అని అన్నారు. అలాంటి ఈ సాంకేతిక విద్యను ప్రైవేట్ సంస్థల్లో విలీనం చేసి ఇంజినీర్ కావాలనే వారి కలల్ని దూరం చేసి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక కోర్సులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల అనుసంధానం, మెరుగైన ప్లేస్‌మెంట్లు కల్పించాలననారు. దానిని వదిలేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో 'శక్తి'అనే విభాగంలో చేర్చి ఉన్నత విద్యకు లక్షల మంది విద్యార్థులను దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే.జీవో నం.97 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, చరణ్, నితిన్, ఆదర్శ్ పాల్గొన్నారు.


కామారెడ్డి..


ఎల్లారెడ్డి..

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీజేపీ ధర్నా

**పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు మండలాల్లో ధర్నా చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని వెంటనే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ సూచన మేరకు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేసినప్పుడు తెలిపారు. బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.**

**– అక్షరటుడే, నెట్‌వర్క్**



బాన్సువాడ..

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి




**అక్షరటుడే, ముప్కాల్:** మండలకేంద్రంలో సోమవారం ఉదయం ఎస్సై కె.కిరణ్ పాల్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురు ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై సూచనలు చేశారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం ప్రమాదకరమని ఎస్సై తెలిపారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోతే ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రజల భద్రత కోసం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని ఎస్సై తెలిపారు. రాత్రి వేళల్లో కూడా మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా పెట్రోలింగ్ చేపడుతున్నట్లు వెల్లడించారు.

## గ్యాస్‌సిలిండర్ ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వర్షం పడుతున్న వేళ గ్యాస్ సిలిండర్లు తరలిస్తున్న ఓ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. మెదక్-నర్సాపూర్ రోడ్డుపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మెదక్ -నర్సాపూర్ రోడ్డుపై చింతకుంట సమీపంలో గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. వర్షం పడుతుండటంతో ఆటో అదుపుతప్పినట్లు స్థానికులు తెలిపారు. ఆటోలో ఉన్న సిలిండర్లు రోడ్డుపై పడిపోయాయి. ఆ సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోకలు లేకపోవడం వల్ల భారీ ప్రమాదం తప్పిందని, డ్రైవర్‌కు సైతం ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు పేర్కొన్నారు.



## బస్టాండ్‌లో చైన్‌స్నాచింగ్.. ఇద్దరు మహిళల నగలు మాయం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఉమ్మడి జిల్లాలో చైన్ స్నాచర్లు పేట్రేగిపోతున్నారు. రోడ్డుపైన, బస్టాండ్లలో మహిళలను టార్గెట్ చేస్తూ ఆభరణాలు లాక్కెళ్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి బస్టాండ్‌లో ఆదివారం సాయంత్రం ఇద్దరు మహిళల మెడలోని బంగారు గుండ్లను దొంగలు మాయం చేశారు. లింగంపేట్ మండలం భవానీపేట్‌కు చెందిన నాగులూరి సుశీల భవానీపేట్ వెళ్లేందుకు బస్సు ఎక్కిన తర్వాత తన మెడలో ఉన్న సుమారు 1.5 తులాల బంగారు గుండ్లు కనిపించకపోవడాన్ని గుర్తించారు. అదేవిధంగా ఎల్లారెడ్డి మండలం సోమార్ పేట్ గ్రామానికి చెందిన కుసులకంటి దీవెన బాన్సువాడ బస్సు ఎక్కిన అనంతరం తన మెడలోని సుమారు 1.5 తులాల బంగారు గుండ్లు పోయినట్లు గుర్తించి వెంటనే ఎల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## కల్లడిలో ఘనంగా వన మహోత్సవం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండల పరిధిలోని కల్లడి గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంసోత్ కిషన్, శనిగరం సౌందర్య సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

